

# ఒద్దనుకున్న ఓనమాలు

- సి హెచ్. ఇంద్రాణి

రిజిస్ట్రార్ ఆఫీసులో వేలి ముద్రలు వేసి వెలుపలికి వచ్చారు వెంకటరావు, అతని భార్య శాంత. కాళ్లో ఎక్కుతున్న భర్తను చూసి ముసిముసి నవ్వులు నవ్వింది శాంత. ఆ నవ్వులో ఏదో చిలిపితనం కనపడింది అతనికి.

"ఏం వేళాకోళంగా ఉందా? ఇందాకటి నుంచి చూస్తున్నాను. రిజిష్టాఫీసులో వేలిముద్ర వేసినప్పటి నుంచి నన్ను ఆటలు పట్టిస్తున్నట్లు అలా ఆ వంకర నవ్వేమిటి?" ఉడుకు మోతుతనంగా అడిగాడు వెంకటరావు.

"పొట్ట పొడిస్తే అక్షరం ముక్క రాని "వేలిముద్రల వెంకాయమ్మ" అని నన్ను ఇన్నాళ్ళూ ఎగతాళి చేశారే. ఇప్పుడేమయింది డాక్టరు చదువులు చదివి అందులోనే డాక్టరేట్లు తీసుకున్న మీ చేతనే వేలిముద్రలు వేయించిన ఘనత ఈ రిజిస్ట్రార్ ఆఫీసు వాళ్ళకే దక్కింది" నవ్వుతూ అంది శాంత.

ఆమె నవ్వుతో పాటు తనూ గొంతు కలిపి వంత పాడాడు వెంకటరావు.

* * *

వెంకటరావు తండ్రి మరీ పెద్ద రైతు కాకపోయినా ఆ గ్రామంలో కాస్త ఓ మోస్తరు రైతే. తల్లి తన ముఖం కూడా చూడకుండా ప్రసవంలోనే పోయింది. కొందరు అది దరిద్రపు జాతకం అన్నారు. కొందరు అదేం కాదు నీది బృహత్ జాతకం అన్నారు. చిన్నప్పుడే అవేం తనకు అర్థం కాలేదు.

గ్రామ జీవితానికి అలవాటుపడ్డ చదువు లేని తండ్రి - అమితంగా ప్రేమించిన భార్య పోగానే జీవితమే ముగిసిపోయిందనుకుని, కర్తవ్యాన్ని కాళ్ళదన్నే పరిస్థితులకు బానిస అయిపోయాడు. తాగుడు అలవాటు పెరిగింది. దానికోసం అప్పులు పెరిగాయి. అడిగిన చోటల్లా అడిగినవారికి వేలి ముద్రలు వేసి ఆస్తిని సర్వనాశనం చేశాడు. మేనమామ వచ్చి తనను ఆదుకునే సమయానికి సమయం మించిపోయింది.

ఆస్తి హారతి కర్పూరంలా కరిగిపోయింది. తండ్రి ఆత్మ అనంత వాయువులో లీనం అయింది. మేనమామతో గుర్రం బండిలో ప్రయాణం అయ్యాడు వెంకటరావు. ఆఖరిసారిగా తను ఈ నాలుగైదేళ్ళూ పెరిగిన గ్రామం వంక తిరిగి చూశాడు. దూరాన ఊరి బయట స్మశానం నుంచి పైకి లేచిన తండ్రి తాలూకు పొగలు తనను ఆశీర్వదించి వీడ్కోలు చెప్పినట్లు అనిపించింది వెంకటరావుకు.

* * *

"సార్, అడ్వాన్సు పోగా మొత్తం పాతిక లక్షలు ముట్టచెప్పేశారు. ఇంటివి, పొలంవి-దస్తావేజు కాపీలు వారం పదిరోజుల్లో తీసుకోవచ్చు. ఇక ఈ డబ్బు తీసుకుని మీరు బయలుదేరండి". ఆలోచనా తరంగాల నుండి తేరుకుని మధ్యవర్తి చేతిలోని క్యాష్ బ్యాగ్ అందుకున్నాడు వెంకటరావు.

"ఇక వెళదామా?" అన్నట్లు భార్యవైపు చూసి ఆమె కనుసన్నల సమ్మతితో కారు స్టార్ట్ చేశాడు.

* * *

ఆరో ఏడు రాగానే వెంకటరావును తమ ఊరిలో బడి లేనందువల్ల పక్క ఊరి బడిలో చేర్పించాడు మేనమామ. అతని భార్య వెంకటరావును తన సొంత కొడుకులాగా చూసుకుంది. అమ్మ లేని లోటు తనకు లేకుండా చేసింది. కానీ అక్కడా విధి వక్రించింది. ఆమె కూడా ఒక ఆడపిల్లను కని భర్త చేతిలో పెట్టి స్వర్గాన్ని చేరింది. వెంకటరావు మళ్ళీ సగం అనాథ అయ్యాడు. కానీ మేనమామ ఆప్యాయం కలిసిన అండదండలతో అడుగు ముందుకేశాడు. ఇంట్లో శాంతను చూసుకోవటం, బడిలో చక్కగా చదువుకోవటం వల్ల అటు బడిలో పంతుళ్ళలోనూ ఇటు బంధువుల మధ్య మంచి పేరే సంపాదించుకున్నాడు వెంకటరావు.

శాంతకు ఆరేళ్ళు రాగానే ఆమెను కూడా బడిలో చేర్పించమని కోరాడు వెంకటరావు, మేనమామను.

"ఈ సంవత్సరం కాదులే. అది మరీ చిన్న పిల్ల. పై ఏడాది చూద్దాం" అని సర్ది చెప్పాడు మామయ్య. అలాగే పై ఏడాది వచ్చింది. కానీ మామయ్య అనారోగ్య కారణాల వల్ల పిల్లను బడికి పంపే ఏర్పాటు వాయిదా పడింది.

వెంకటరావు ఫోర్త్ ఫారంకు వచ్చాడు. హైస్కూలుకు మారాడు. శాంతకు ఏడు నిండి ఎనిమిదేళ్ళు వచ్చాయి. అందుకని వెంకటరావే పట్టుపట్టి శాంతను పక్క ఊరికి ఎలిమెంటరీ స్కూల్లో చేర్పించాడు. చేరిన రోజే ఆటల్లో క్రిందపడి మోకాళ్ళు మోచెయ్యి దొక్కుపోయి నెత్తురు వచ్చింది శాంతకు. అందరూ భయపడి ఆమెను ఇంటికి చేర్చారు. దానితో పాటు శాంతకు జ్వరం వచ్చి వారం రోజులు బడికి వెళ్ళటం కుదరలా.

తర్వాత మళ్ళీ వెంకటరావే పట్టుపట్టి శాంతను తనతో పక్క ఊరి స్కూలికి తీసికెళ్ళి దింపి తన స్కూలుకి వెళ్ళాడు. అది 1946 సంవత్సరం. భారతదేశానికి స్వాతంత్ర్యం వస్తుందనీ, రాదనీ తర్జన భర్జనలు. ఎక్కడో ఢిల్లీ, బాంబే, కలకత్తా, మద్రాసు నగరాలలో కలవరాలని విని శాంత తండ్రి కృష్ణాజిల్లాలోని శాంత చదువు ఆపివేశాడు. 1947లో స్వాతంత్ర్యం వచ్చిన సంతోషంతో ఆ వేడుకలతోనూ, ఎలక్షన్లు, మీటింగులు ఈ పరిణామాలతో శాంత బడి చదువు బందలయింది. దాన్ని గురించి సొంత తండ్రి బాధపడలేదు. కానీ వెంకటరావు విలవిలలాడిపోయాడు.

"ఆడపిల్లకు చదువు - మొగవాడికి అందం అంత ముఖ్యం కాదోయి అల్లుడూ. అదీకాక దాన్ని రేపు చేసుకోబోయేది నువ్వేగా. తర్వాత నువ్వు

నేర్చుకున్నదంతా ఆమెకు రాత్రింబగళ్ళు తీరికగా కూర్చొని నేర్పుకో" అని వేళాకోళం చేశారు మేనమామ, తదితర గ్రామ పెద్దలు. మొత్తానికి అతను స్కూలు ఫైనల్ వచ్చేసరికి ఒకటవ తరగతి కూడా పూర్తిచెయ్యని శాంత - శాంతమ్మగా ఆ గ్రామంలో చెలామణి కాసాగింది.

* * *

"డాడీ ఇట్ ఈస్ టూ హాట్ హియర్, లెటస్ గో బాక్ టూ అవర్ అమెరికా" సన్నీ కంప్లైంట్ చేశాడు.

"యూ ఆస్క్ యువర్ మమ్మీ" నవ్వుతూ భార్య వంక చూశాడు వెంకటరావు. "ఇదుగోనోయి నిన్నే... నీ కొడుక్కి ఈ ఊరు నచ్చలేదుట."

"ఏడిశాడు వాడికేం తెలుసు. ఏయ్‌సన్నీ వియ్ లివ్ హియర్ టూ మోర్ డేస్."

"మమ్మీ లివ్ గాదు స్టే" శాంత ఇంగ్లీషును సరిదిద్దాడు ఐదేళ్ళ సన్నీ.

"ఇదుగో ఎందుకొచ్చిన గొడవ గానీ వాడికెలాగూ మన తెలుగు నేర్పావు గదా, హాయిగా వాడితో తెలుగే మాట్లాడు. మధ్యలో ఆ ఇంగ్లీషుని ఎందుకు చంపుతావు?" వెంకటరావు హాస్యాన్ని ఖండిస్తూ 'చాల్లెండి మీరూ మీ ఇంగ్లీషు గొప్పలు' అంటూ వంటింట్లోకి వెళ్ళింది శాంత.

* * *

ఆరోజు తను ఎస్.ఎస్.ఎల్.సి పాసయిన రోజు. మామయ్య దాదాపు ఆ ఊర్లో అందర్నీ పిలిచి విందు ఏర్పాటుచేశాడు. పంచాయితీ ప్రెసిడెంట్ తనకో పెన్ ప్రజెంట్ చేశాడు. మేనమామ పరపతితో బెజవాడ కాలేజీలో వెంకటరావును చదివించాడు. తర్వాత మద్రాసు మెడికల్ కాలేజీలో చేర్పించాడు. చూస్తూండగానే తన డాక్టరు కోర్సు అయిపోయి హౌస్ సర్జన్ కూడా పూర్తి అయింది. ఈమధ్య మునుపటిలా తనకూ శాంతకూ జరగబోయే పెళ్ళి సంగతుల గురించి ఎక్కువ ప్రస్తావన తేవటం లేదు, మాటల్లో మామయ్య. దానికి తోడు వెంకటరావుకి వచ్చిన ఫారెన్ టూర్ ఆఫర్...

బోస్టన్‌లో ఫెలోషిప్‌తో పాటు ఎం.ఎస్.లో సీటు వచ్చింది. మామయ్య, శాంత నవ్వుతూ వీడ్కోలు ఇచ్చారు. మూడు సంవత్సరాలు అమెరికాలో ఉండి ఇండియాకు వచ్చాడు వెంకటరావు. అందరూ సంతోషించారు. ఓ నెలరోజుల పాటు మద్రాసు, బెజవాడ పక్క ఊర్లలో ఉన్న తన స్నేహితులను, హితులను తిరగేసి ఆరోజే ఇల్లు చేరాడు వెంకటరావు. ఇంట్లో ఒకే సందడిగా ఉంది. శాంతకు పెళ్ళిచూపులు నిశ్చయం చేశారు, పక్క ఊరి మునసబు గారబ్బాయితో....

చాలామంది తెలిసినవాళ్ళు - తెలియనివాళ్ళు తనకు కొంచెం జ్ఞాపకం ఉన్న ముఖాలు, పూర్తిగా ఈమధ్య కాలంలో మర్చిపోయినవి చాలా కనిపిస్తున్నాయి. అయోమయంగా లోపలకు వెళ్ళాడు వెంకటరావు. పెళ్ళి పెద్దలు కూర్చొని వ్యవహారాలు మాట్లాడుకుంటున్నారు.

అప్పుడు తన తప్పు గ్రహించాడు వెంకటరావు. ఇండియాకి వచ్చి ఇన్ని రోజులయినా తనను ఆదుకొని ప్రాణం నిలిపి ఇంత పెద్ద డాక్టరుని చేసిన మేనమామ ఆశలను అలక్ష్యం చేసిన తనను తనే నిందించుకున్నాడు. ఇంతలో ఏదో చిన్న గొడవ. తూర్పున మునసబు గారి పొలం పక్కనున్న మామయ్య పొలాన్ని కూడా అల్లుడి పేరున రాయమని అడుగుతున్నారు పెళ్ళివారు.

"అది మా మేనల్లుడికి రాసివ్వాలనుకుంటున్నాను కాబట్టి అది మీకు రాదు" అని మామయ్య నిర్మొహమాటంగా చెప్పాడు.

గుసగుసలు మొదలయినాయి. అవి మెల్లిగా నిష్ఠూరాలయి మాటా మాటా పెరిగింది. ఫలితం అందరూ వెళ్ళిపోయారు. గల గల నవ్వులతో మొదలయి రణగొణ ధ్వనులతో మారుమోగిన ఆ ఇంట్లో ఇప్పుడు నిశ్శబ్దం తాండవం చేస్తోంది.

ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ "మామయ్యా నన్ను క్షమించు. నేను ఇప్పటికే చాలా ఆలస్యం చేశాను. మీరు నన్ను ఆజ్ఞాపించి ఉంటే ఈ పెళ్ళి ఎంతో వైభవంగా జరిగేది. ఈ అర్థమైన వాళ్ళకూ మనం సమాధానం చెప్పఖర్లేదు" అన్నాడు వెంకటరావు.

అతడ్ని ఆనందంతో హృదయానికి హత్తుకున్నాడు. ఇంటికి వచ్చిన బంధువులు, గ్రామ పెద్దలు అందరూ సంతోషించారు.

అలా పెళ్ళి చేసుకుని శాంతతో అమెరికా వెళ్ళిన వెంకటరావు మేనమామ ఆఖరి చూపు కోసం ఆరు నెలల క్రితం ఇండియాకి వచ్చాడు. శాంత, బాబు సన్నీతో. ఆస్థినంతా అప్పజెప్పి కన్నుమూశాడు మేనమామ. ఆస్థిని ఆ గ్రామంలోనే తెలిసినవారికి అమ్మి ఆ డబ్బును బ్యాంకులో ఫిక్సుడ్ డిపాజిట్‌లో వేసి భార్య, కొడుకుతో అమెరికాకు తిరిగి వెళ్ళిపోయాడు వెంకటరావు.

* * *

మంచో, చెడో - కాలం ఎవరికోసం ఆగదు. సన్నీ పెరిగి పెద్దవాడవుతున్నాడు. వెంకటరావు ప్రాక్టీసు రోజు రోజుకు పెరిగిపోతున్నది. శాంతకు ఇప్పుడు డబ్బుకు, హోదాకు లోటు లేదు. కానీ, ఆమె ఇంకా పాత శాంతమ్మే రాయటం, చదవటం రాదు. అయినా మంచి మాటకారి. ప్రతి సమస్యనూ క్షుణ్ణంగా పరిశీలించి చక్కగా ఆలోచించగలదు. అమెరికాలో పెరిగే సన్నీకి తన అవసరం లేకపోతోందన్న సత్యాన్ని గ్రహించింది. తనకి తెలిసిన తెలుగు అతనికి పనికిరాదు. అతనికి కావలసిన ఇంగ్లీషు తనకు తెలియదు. తల్లిగా మొదటి గురువుగా తన స్థానాన్ని కోల్పోయిన సంగతి ఆలస్యంగానైనా తెలుసుకుంది.

సన్నీ 18 ఏళ్ళకే ఓ అమెరికన్ పిల్లను ప్రేమించి చర్చిలో పెళ్ళి చేసుకుని ఇంటికి తీసుకువచ్చాడు. వెంకటరావు తప్పంతా శాంతదన్నాడు. బదులుగా శాంత వెంకటరావు వ్యాపకాలను నిందించింది. ఫలితం ఆ ఇంట్లో శాంతి లేదని సన్నీ తన భార్యతో న్యూయార్క్‌లో వేరే కాపురం పెట్టాడు.

సన్నీకి కవలు పిల్లలు పుట్టారని విని న్యూయార్క్‌కు వెళ్ళారు శాంత, వెంకటరావులు. ఈలోగానే సన్నీకి అతని భార్యకి పడకపోవడంతో కోడలు పిల్ల కోర్టులో విడాకులకు అప్లై చేసిందని తెలిసిన తల్లిదండ్రులు విలవిలలాడిపోయారు. సన్నీ ఇంటికి రావటం మానేశాడు. కేసు ఫైనలు అయ్యేసరికి చాలా డబ్బు ఖర్చయి ఆ పిల్లకు నష్టపరిహారం చెల్లించుకుని పిల్లల్ని ఇంటికి తెచ్చుకుంది శాంత.

* * *

అప్పుడే మనవల్ని నిద్రపుచ్చి వెంకటరావు దగ్గరికొచ్చిన శాంత,

"ఏవండీ మనం ఈ అమెరికా వదిలి ఇండియాకి వెళ్ళిపోదామండీ. ఇక్కడి వాతావరణానికి ఈ సభ్యత పనికిరావచ్చు కానీ ఈ పుట్టిన పసికందుల మీద కూడా దాని ప్రభావం పడటం నాకు ఇష్టం లేదు. వీరిని భారతీయులుగానే పెంచుకుందాం, మీకూ వయస్సు మీద పడుతున్నది. ఇక్కడ సంపాదించింది చాలు. ఇది తీసుకుని మనదేశం వెళితే కాలుమీద కాలేసుకుని నాలుగైదు తరాలు తినొచ్చు. పైగా ఇండియాలో మన డిపాజిట్‌లు ఎలాగూ ఉన్నాయి." అని జ్ఞాపకం చేసింది శాంత.

వెంకటరావు ఆలోచిస్తున్నాడు. "నువ్వు చెప్పింది నిజమే కానీ వీళ్లని ఇండియాకి తీసుకెళ్ళి బాధ్యతగా పెంచాలంటే చాల శ్రమతో కూడిన పని... అక్కడా నా వ్యాపకాలు నాకు వుంటాయి. ఇక... నువ్వూ..." అని ఆగిపోయాడు.

"నేను చదువుకుంటానండీ" ఆవేశంగా అంది శాంత.

తన చెవులను తనే నమ్మలేకపోయాడు వెంకటరావు. "వేళాకోళాలాడకుండా పడుకో పొద్దుపోయింది" ఆమె పట్టుదలను పరీక్షించాలనే వెటకారంగా అన్నాడు.

"ఏవుందండీ గొప్ప చదువు. ఇంగ్లీషులో 26 అక్షరాలు, తెలుగులో ఓ 60 అక్షరాలున్నాయా. నేను పట్టుబట్టానంటే మూడు నెలల్లో ఈ రెండు భాషల్నీ నేర్చుకోగలను. గంటకో అక్షరం నేర్చినా చాలు. ఇక మిగిలినవి నేర్పటానికి మీరున్నారు. ఈ పిల్లలకి మూడో ఏడు వచ్చేసరికి నేను మెట్రిక్ కట్టి పాసవుతాను" ఆవేశంగా అంది శాంత.

"అయ్య బాబోయ్ - ఈ పట్టుదలే ఉంటే మెట్రిక్ ఏవిటి చక్కగా ఓపెన్ యూనివర్శిటీలో డిగ్రీయే తీసుకోవచ్చు. ఛలో ఇండియా. అయినా నీకు చదువు ప్రాముఖ్యం మనవలు పుడితేగానీ తెలిసింది కాదు" అన్నాడు ఉడికిలింపుగా నవ్వుతూ.

"పొండి. మీరు మరీనూ" అంది సిగ్గుల మొగ్గయి శాంత.